క్లుప్తంగా

విద్యా సామగ్రి వితరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్‌కు రూ. 20 వేలు విలువగల స్టేషనరిని అందజేసినట్లు ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ కెతుర, సఖి ఫౌండేషన్ అధ్యక్షురాలు రహమతున్నీసా తెలిపారు. బుధవారం అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఎండీ హెచ్ గ్రూప్స్ అధినేత నవీద్, శంకరాపురం టీవీఎస్ షోరూం మేనేజర్ విజయలక్ష్మి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజువారీగా వాడే వస్తు సామాగ్రిని దాతలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సునీల్ జయంత్, సెక్రటరీ దినేష్ కుమార్, మీకోసం సేవా సంస్థ ప్రతినిధి విష్ణువర్ధన్, బాసట ప్రతినిధి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులు, పంట కాల్వల పూర్తికి దశల వారీ పోరాటాలను చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో పెండింగ్ ప్రాజెక్టులు, పంట కాల్వల పూర్తి సాధన కోసం ఆగస్టు 5 వరకు చేపడుతున్న పోరాటాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగ సుబ్బారెడ్డి, నగర కార్యదర్శి వెంకట శివ, నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, బషీరున్నీషా తదితరులు పాల్గొన్నారు.

నేడు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన

కడప ఎడ్యుకేషన్ : ఇటీవల జరిగిన ప్రభుత్వ అక్రమ బదిలీలను రద్దు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల ఎదుట గురువారం చేపట్టబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా కోరారు. బుధవారం కడప యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, పాలెం మహేష్ బాబు, గౌరవ అధ్యక్షులు నాగార్జునరెడ్డి, ట్రెజరర్ నరసింహారావు పాల్గొన్నారు.

కేవీకేలో బాలవాటిక నోటిఫికేషన్ విడుదల

కడప ఎడ్యుకేషన్ : కడప కేంద్రియ విద్యాలయంలో (కేవీకే) బాలవాటిక-3వ తరగతిలో ప్రవేశానికి కేంద్రియ విద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసిందని ప్రిన్సిపాల్ పద్మజరాణి తెలిపారు. బాలవాటిక-3లో ప్రవేశానికి 5-6 ఏళ్ల మధ్య వయస్సున్న చిన్నారులు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 18వ తేదీ నాటికి ముగుస్తుందని ఆమె తెలిపారు. విద్యార్థుల ఆన్‌లైన్ ప్రక్రియ ఈ నెల 20న జరుగుతుందని తెలిపారు. ఈ నెల 29 నుంచి బాలవాటిక-3 తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. మరిన్ని వివరాలకు విద్యాలయ వెబ్‌సైట్ https://kadapa.kvs.ac.in లో చూడాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

మోనూ కచ్చితంగా అమలుచేయాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తింటున్న ఏడీ దేవరాజు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ కచ్చితంగా అమలు చేయాలని మిడ్ డే మీల్ ఏడీ దేవరాజు సూచించారు. బుధవారం కడపలోని నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనంతోపాటు కూరల నాణ్యతను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆ తర్వాత 10వ తరగతి విద్యార్థులతోపాటు తరగతి గదిలో కూర్చుని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌పై ఫిజికల్ సైన్సు పాఠాన్ని విన్నారు.

రెగ్యులర్ డీబీసీడబ్ల్యూఓను నియమించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖకు రెగ్యులర్ డీబీసీడబ్ల్యూఓను నియమించాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని ఆర్‌ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు రెగ్యులర్ అధికారి లేకపోవడం వల్ల ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. జిల్లా కార్యాలయంలో ఉన్న అధికారులకు సిబ్బందికి, వార్డెన్‌లకు సమన్వయలోపం తీవ్రంగా ఉందన్నారు. దీనివల్ల హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాల సమకూరక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షులు శివప్రసాద్, జిల్లా నాయకులు చరణ్, షాబాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష 'జగనన్న సురక్ష'

మేయర్ కె. సురేష్ బాబు



10వ డివిజన్‌లో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రక్షలా మారిందని కడప మేయర్ కె. సురేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక 10, 35వ డివిజన్లలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' శిబిరాల్లో ఆయన పాల్గొని, సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతంలో ఎవరైనా అర్హులు ఉంటే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా వారికి మేలు చేకూరుస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని 'జగనన్న సురక్ష' శిబిరాల్లో పరిష్కరిస్తున్నామన్నారు. కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు తదితరాలకు సంబంధించి 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివ రామిరెడ్డి, 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎ షంషీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, సుభాన్ బాషా, సుబ్బారెడ్డి, మౌలా, షఫీవుల్లా పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' ప్రజలకు వరం

'జగనన్న సురక్ష' ప్రజలకు ఒక వరమని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు, 48వ డివిజన్ ఇన్‌చార్జి బంగారు నాగయ్య యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక రామరాజుపల్లెలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' శిబిరానికి ఆయన హాజరై అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి సిఫారసులు లేకుండా పారదర్శకంగా పథకాలు ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుల్ రెడ్డి, ఓబులేసు, సుమన్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు మంజూరు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో తమకు అనారోగ్య సమస్యలున్నాయని విన్నవించిన నలుగురు లబ్ధిదారులకు 48 గంటల్లోనే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం అందింది. బుధవారం అపూర్వ కళ్యాణ మండపంలో కడప మేయర్ కె. సురేష్ బాబు లబ్ధిదారులకు అందుకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తేది నుంచి 10వ తేది వరకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించిన నేపథ్యంలో కడపకు చెందిన ఎం. అమరావతి, వైఎస్ ప్రకాష్ రావు, కమాల్‌బాషా, తిరుపతికి చెందిన మునితులసిలు తమ అనారోగ్య సమస్యల గూర్చి ముఖ్యమంత్రికి విన్నవించారన్నారు. దీనిపై స్పందించిన సీఎం 48 గంటల్లోనే వారికి రూ.3లక్షలు మంజూరు చేశారని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ప్రజలకు వరంలా మారిందని, అడిగిన వెంటనే తక్షణ సాయం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు లబ్ధిదారుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప నగరపాలక సంస్థ మేనేజర్ హిదాయతుల్లా, ఆర్‌ఐ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

నీటి సరఫరా సక్రమంగా జరగాలి



మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో ఫిట్టర్లు, వీధి దీపాల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద నిర్మిస్తున్న పైపులైన్లు, పాండ్ స్టోరేజ్ కెపాసిటీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అందుకు కావలసిన పరికరాలను తెలియజేయాలన్నారు. నీటి సరఫరా చేయు క్రమంలో ఆర్సీ టెస్ట్ రిపోర్టు ప్రతిరోజూ తెలియజేయాలని, బోరు వాటర్‌ను క్లోరినేషన్ చేసి ఆర్సీ 0.2 రిపోర్టు వచ్చేలా చూడాలన్నారు. మున్సిపల్ స్టేడియం వద్దనున్న ఎల్ఎస్ఆర్ ట్యాంకు నుంచి ఇంటర్ కనెక్షన్ ఇచ్చి ప్రజలకు నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి దీపాలకు సంబంధించి ఫేస్, సీసీఎంఎస్ బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ రత్నాలరాజు, ఈఈ నారాయణస్వామి, పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి, డీఈలు వేణుగోపాల్, రాజేష్, కరిముల్లాఖాన్, అబిద్ హుస్సేన్, ఏఈలు, ఫిట్టర్లు పాల్గొన్నారు.

వైవీయూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు



ఆర్.ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు అన్ని విధాలుగా మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం వైవీయూ పరిధిలోని గురుకులం భవనాల్లో రూ.1.3 లక్షలతో నిర్మించిన ఆర్.ఓ వాటర్‌ప్లాంట్‌ను, ఫ్లోరింగ్‌ను, పరిశోధన, ప్రామాణిక పుస్తకాల విభాగాన్ని వైస్ చాన్సలర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. గురుకులం నుంచి తరగతులకు వెళ్లేందుకు అవసరమయ్యే రవాణా విషయంపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, సీడీసీ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు, కామర్స్ ఆచార్యులు డా. విజయ భారతి, ఎంబీఏ విభాగాధిపతి డా. అమృతప్రసాద్‌రెడ్డి, డా. పి.వి. వరప్రభాకర్, డా. ఎస్.వి. సుబ్బారెడ్డి, డా. పి. సరిత పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ ఎంపికలు



ఎన్‌సీసీ ఎంపికలను పరిశీలిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా, హెచ్ఎం, ఎన్‌సీసీ అధికారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో బుధవారం నిర్వహించిన ఎన్‌సీసీ ప్రవేశ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమానికి 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా విచ్చేసి ఎంపికలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఓ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించే ఎన్‌సీసీలో చేరడం ద్వారా దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగమణి మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన అలవడతాయన్నారు. ఎన్‌సీసీ అధికారి పి.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరే విద్యార్థులకు లభించే ప్రయోజనాలను వివరించారు. అనంతరం 300 మంది విద్యార్థులకు ఎంపికలు నిర్వహించి 50 మంది (17 మంది బాలికలు, 33 మంది బాలురు) విద్యార్థులను ఎంపిక చేశారు. మరో 14 మందిని రిజర్వ్‌లో ఉంచినట్లు ఎన్‌సీసీ అధికారి తెలిపారు. అనంతరం సీఓ ఎన్‌సీసీ కార్యాలయాన్ని, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎల్. వెంకటలక్ష్మిదేవి, ఎన్‌సీసీ సిబ్బంది చల్లా గోపాల్‌రెడ్డి, పీఐ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



డీఈఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఇటీవల బదిలీలు చెందిన ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్ సరిగా లేక జీతాలు నిలిచిపోయాయని వెంటనే కేడర్ స్ట్రెంత్ అప్‌డేట్ చేసి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్(ఎస్టీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, సుబ్బరాజు కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ సమస్యల వల్ల జీతాలు చెల్లించడంలో తీవ్రజాప్యం ఏర్పడుతోందన్నారు. బదిలీల వల్ల చాలా మంది ఉపాధ్యాయులు ఈ నెల జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత సమస్యలను పరిష్కరించి సకాలంలో జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు డీఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రామచంద్ర, ప్రసాద్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మధుసూదన్‌రావు, రామోహన్‌రెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆడికృత్తిక పూజలు

కడప కల్చరల్ : ఆడికృత్తిక సందర్భంగా గురువారం కడప నగరంలోని పలు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించనున్నారు. ఆషాడమాసంలో వచ్చే ఆడికృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాలతో పాటు స్వామి మందిరాలుగల శివాలయాల సముదాయాలలో కూడా ఈ పూజలు నిర్వహించనున్నారు. స్థానిక దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

అనంతరం స్వామి, అమ్మవార్లను మయూర వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో కూడా ఆడికృత్తిక విశేష పూజలు నిర్వహిస్తారు. కడప నగరం నూతన కలెక్టరేట్ వద్దగల మహావీర్ సర్కిల్‌లోని నాగలకట్ట సుబ్రమణేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకువిశేష పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తుల సమక్షంలో భారీగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

చింతకొమ్మదిన్నె : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కొలుములపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదిలో మండలస్థాయిలో ప్రథమ స్థాయిలో రాణించిన విద్యార్థులకు సర్వత్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు అందించారు.

సేవకు సలాం



నిరంతరం పర్యవేక్షించేది



కరోనా సమయంలో వలంటీర్లు ధైర్యంగా ప్రతి ఇంటినీ ఆరోగ్య సర్వే చేశారు. వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేయడం, డాక్టర్ల వద్దకు తీసుకెళ్లారు. ఆ సమయంలో కడప నగరంలోని 42వ డివిజన్‌లోని రవీంద్రనగర్ విలాసంబావి వీధిలో ఉంటున్న శిరిగిరి నాగరాజ కుటుంబానికి కూడా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వలంటీర్ జ్యోతి దీప్తి వారి స్థితిగతులు తెలుసుకొని డాక్టర్ వద్దకు తీసుకెళ్లి వారికి సమయానికి మందులు, మాస్కులు అందజేసి కోవిడ్ గండం నుంచి గట్టెక్కేలా చేసింది. – కడప కార్పొరేషన్

నాగరాజుకు పింఛన్ అందజేస్తున్న జ్యోతి దీప్తి



వలంటీర్ అందించిన సేవలు మరువలేను

మాకు వలంటీర్ దీప్తి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేను. కోవిడ్ సమయంలో మాకు మందుల కిట్, మాస్కులు అందజేయడమేగాక ప్రతిరోజూ వచ్చి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేది. డాక్టర్ వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించి, వ్యాక్సిన్లు వేయించింది. అలాగే ఒకటోతేది వచ్చిందంటే మా ఇంటి తలుపుతట్టి నిద్రలేపి పింఛన్ అందిస్తుంది. గతంలో పింఛన్ కోసం ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ లేదు.

– శిరిగిరి నాగరాజ, విలాసంబావి వీధి

రిమ్స్‌కు వెళ్లి పెన్షన్ అందజేత



రిమ్స్‌లో సుబ్బనరసమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రవితేజ

కడప నగరంలోని 48వ డివిజన్‌కు చెందిన సుబ్బనరసమ్మ అనారోగ్యం కారణంగా రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. రామరాజుపల్లె సచివాలయానికి చెందిన రవితేజ పెన్షన్ పంపిణీ చేసేందుకు సుబ్బనరసమ్మ ఇంటికి వెళ్లగా ఆమె రిమ్స్‌లో చికిత్స పొందుతోందని తెలుసుకున్నాడు. దీంతో రవితేజ రిమ్స్‌కు వెళ్లి బాధితురాలికి పెన్షన్ అందజేసి ప్రశంసలు పొందాడు.

– కడప కోటిరెడ్డిసర్కిల్

ఇతర ఊర్లో ఉన్నా ఆగని సేవ..



కడప అరవిందనగర్ 13వ డివిజన్‌లో ఎస్తేర్ వలంటీర్‌గా పనిచేస్తోంది. తన పరిధిలోని ప్రజలకు ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలు అందజేస్తూ నిజాయితీగా సేవలు అందిస్తోంది. తాజాగా తన పరిధిలోని వృద్ధురాలు లక్షుమ్మ తన కుమార్తె ఉంటున్న ప్రొద్దుటూరు వెళ్లింది. 1వ తేదీన పింఛన్ అందజేసేందుకు వలంటీర్ ఎస్తేర్ ఆమె గురించి ఆరా తీయగా ప్రొద్దుటూరులో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి పింఛన్ అందజేసి అందరి మన్ననలు పొందింది.

– కడప కోటిరెడ్డిసర్కిల్

మాతో రండి.. అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపిస్తాం

- టీడీపీ ప్రభుత్వంలో ఏం చేశారో మీరు చూపండి
- వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో తమతో వస్తే మీడియా సమక్షంలోనే చూపిస్తామని, టీడీపీ ప్రభుత్వంలో మీరు ఏం అభివృద్ధి చేశారో చూపాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, దాసరి శివప్రసాద్, శ్రీరంజన్‌రెడ్డి, మునిశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు ఎం. సుబ్బారెడ్డి, ఎస్ఎండీ షఫీ, ఆర్. చెన్నయ్యలు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. కడపలో సుమారు రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుంటే టీడీపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకున్నారేమోనని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, కడప నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న శ్రీనివాసులరెడ్డి కడప అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు తెచ్చారా అని సూటిగా ప్రశ్నించారు. వైఎస్సార్ హయాంలో, ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ఈ జిల్లా అభివృద్ధి చెందిందన్నారు. రిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నారని, మానసిక వైద్యశాల, ఐ హాస్పిటల్, కేన్సర్ ఆసుపత్రుల నిర్మాణం సాగుతోందన్నారు. మహావీర్ సర్కిల్– రిమ్స్, ఎర్రముక్కపల్లె– రైల్వేస్టేషన్ రోడ్లను ఆధునీకరించారన్నారు. ఇటీవలే ముఖ్యమంత్రిచే రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కులను ప్రారంభించామన్నారు. త్వరలో మరో మూడు రహదారులు విస్తరించి అభివృద్ధి చేయబోతున్నామన్నారు. బ్రహ్మం సాగర్ నుంచి నీరు కడపకు తేవడానికి రూ.572 కోట్లు ఖర్చు పెట్టబోతున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారి తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కడప అభివృద్ధి గూర్చి మాట్లాడే నైతిక అర్హత వారికి లేదన్నారు. కడపలో రహదారుల విస్తరణ పూర్తయితే టీడీపీ నాయకులకు రాజకీయ సన్యాసం తప్పదన్నారు. గతంలో బహిరంగ చర్చకు సవాల్ విసిరి, తోక ముడిచారని.. ఇప్పుడు అలాకాకుండా మీడియా సమక్షంలో ఎక్కడైతే అభివృద్ధి జరిగిందో అక్కడికి వెళ్లి చూద్దాం రమ్మంటూ సవాల్ చేశారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో జిల్లాకు ఏం ఒరగబెట్టారో టీడీపీ నేతలు చెప్పాలన్నారు. దీనిపై ఎక్కడ చర్చించేందుకైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

బీకేఎం జిల్లా అధ్యక్షుడిగా మహేశ్వరరెడ్డి

లింగాల : భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా లింగాలకు చెందిన తేరా మహేశ్వరరెడ్డిని నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.యల్లారెడ్డి నియామక పత్రం అందించారు.

బ్రిడ్జిపనులకు భూమి పూజ



బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని ఓబుల్‌రెడ్డిపల్లె వద్ద రూ.57లక్షలతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కురిసిన వానలకు వాగులో ఇద్దరు వ్యక్తులు చిక్కుకొని కొన ఊపిరితో బయట పడటం జరిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో పర్యటించినప్పుడు వాగుకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ వీరయ్యకు ఆయన సూచించారు. సర్పంచు విజయరాముడు, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీటీసీ గంగాధర, సివిల్ సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, గంగాధర, గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వీరపునాయునిపల్లె: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అలిదెన, వీరపునాయునిపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అనంతరం వీరపునాయునిపల్లె సచివాలయ పరిధిలో 197మందికి, అలిదెన సచివాలయ పరిధిలో 125 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జగనన్న సురక్ష పరిశీలకుడు హిదాయతుల్లా, వీరపునాయునిపల్లె సర్పంచు మణికంఠ, మాజీ సర్పంచులు రవీంద్రనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.